ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 25.08.2026 సమయం: 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. నిజామాబాద్‌లోని జాతీయ పసుపు బోర్డు ప్రధాన కార్యాలయంలో గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఈరోజు ''సునహరి మిట్టి అభియాన్ ', మార్కెట్ అనుసంధాన కార్యక్రమాలను ప్రారంభించారు.

2. మూసీ ప్రాజెక్టు కోసం భూ సేకరణను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

3. మంత్రి కొండా సురేఖ , ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై విచారణ జరిపిన క్రమ శిక్షణ కమిటి ఈరోజు పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కు నివేదికను అందజేసింది.

4. 15 వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు చేపట్టిన నిరాహార దీక్ష ఈరోజు ముగిసింది.

**గవర్నర్**

రైతుల సంక్షేమమే రాష్ట్ర , దేశ సంక్షేమమని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. పసుపు సాగులో ఆధునిక సాంకేతికత , సహజ వ్యవసాయ పద్ధతులు , ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తులు, బలమైన మార్కెట్ అనుసంధానంతో రైతుల ఆదాయాన్ని పెంచాలని గవర్నర్ పిలుపునిచ్చారు. నిజామాబాద్‌లోని జాతీయ పసుపు బోర్డు ప్రధాన కార్యాలయంలో

పసుపు రైతులతో ముఖాముఖి నిర్వహించారు. రైతుల సమక్షంలో ''సునహరి మిట్టి అభియాన్', మార్కెట్ అనుసంధాన కార్యక్రమాలను గవర్నర్ ప్రారంభించారు. ఈ పర్యటనలో భాగంగా జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో గవర్నర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు చివరి గడపకు చేరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. జిల్లాపై ఎల్‌నీనో ప్రభావం, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు క్రాప్ డైవర్సిటీ ప్రోత్సాహంపై వ్యవసాయ శాఖ అధికారిని గవర్నర్ ప్రశ్నించారు.

డెస్క్

**రేవంత్**

మూసీ ప్రాజెక్టు కోసం భూ సేకరణను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో మూసీ ప్రాజెక్టుపై ఆయన సమీక్ష నిర్వహించారు. ల్యాండ్ పూలింగ్‌తో పాటు ఎఫ్‌టీఎల్ , బఫర్ జోన్ , అసైన్డ్ భూముల సేకరణపై స్పష్టమైన విధానం రూపొందించుకోవాలని , న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా చూడాలని సూచించారు. ప్రాజెక్టు ఫేజ్-2కు త్వరగా టెండర్లు పిలవాలని ఆదేశించారు. మంచిరేవుల ఓంకారేశ్వరస్వామి ఆలయం టెండర్లు వెంటనే పిలవాలని , కొత్వాల్‌గూడా బర్డ్స్ పార్క్ కు మరింత ప్రచారం కల్పించాలని సూచించారు.

డెస్క్

**నివేదిక**

టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు క్రమశిక్షణ కమిటీ నివేదిక సమర్పించింది. మంత్రి కొండా సురేఖ, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై విచారణ జరిపిన కమిటీ చైర్మన్ మల్లు రవి, వైస్ చైర్మన్ శ్యామ్ మోహన్ హైదరాబాద్‌లో ఈ నివేదికను అందజేశారు.

డెస్క్

**కిషన్ రెడ్డి**

అమెరికా పర్యటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు అర్ధరహితమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. కేంద్రం అనుమతి రాకుండానే రేవంత్ ఆదరాబాదరాగా పర్యటన పెట్టుకున్నట్లు తెలిపారు. అర్హతలేని వ్యక్తులను సీఎం తన పర్యటనలో కలవాలని నిర్ణయించుకున్నారని చెప్పారు. స్పష్టమైన కారణాలతోనే విదేశాంగ శాఖ అనుమతి ఇవ్వలేదన్నారు.

బైట్ - కిషన్ రెడ్డి

డెస్క్

**టవర్స్**

క్యూఆర్ పరిధిలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి 15 నియోజకవర్గాల్లో టెండర్ ప్రక్రియ పూర్తయిందని రెవెన్యూ , హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సచివాలయంలో హౌసింగ్ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. తొలి విడతలో 16 నియోజకవర్గాల్లో వచ్చిన 60 వేల 720 దరఖాస్తుల్లో 40 వేల 900 మందిని అర్హులుగా గుర్తించామని , ఈనెల 27 నుంచి 30 వరకు వారి సమక్షంలో పారదర్శకంగా లక్కీ డ్రా నిర్వహిస్తామని వివరించారు. ఎంపిక కాని దరఖాస్తుదారులకు 10 వేల రూపాయల ఈఎండీని తిరిగి జమ చేస్తామన్నారు. మరో నాలుగు నియోజకవర్గాల్లో స్థలాలు ఎంపిక చేశామని, సెప్టెంబర్ 3వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

డెస్క్

**సీతక్క**

గ్రామీణ అభివృద్ధి శాఖపై మంత్రి సీతక్క సచివాలయంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాలు బాగా కురుస్తున్న నేపథ్యంలో వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని, ఇప్పటి వరకు 6.18 కోట్ల మొక్కల లక్ష్యానికి గాను 5.32 కోట్ల మొక్కలు నాటినట్లు ఆమె తెలిపారు. నాటిన మొక్కల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తూ , నీరు అందిస్తూ 100 శాతం మనుగడ సాధించేలా చూడాలని ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయతీలో రోజుకు కనీసం 60

మంది కూలీలకు ఉపాధి కల్పించాలని , నివాస ప్రాంతానికి సమీపంలోనే పని ఇవ్వాలని సూచించారు. ఆదివాసి గిరిజన ఏజెన్సీ ప్రాంతాల్లో చెక్ డ్యాముల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని మంత్రి సూచించారు.

డెస్క్

**దీక్ష ముగింపు**

15 వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు చేపట్టిన నిరాహార దీక్ష ఈరోజు ముగిసింది. రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్ నిమ్మరసం తాగించి రామచందర్ రావు దీక్షను విరమింపజేశారు. నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ఈ దీక్షకు వివిధ యూనివర్సిటీలు, ఇంజనీరింగ్, మెడికల్, పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు వేలాదిగా తరలివచ్చి సంఘీభావం ప్రకటించారు. యువమోర్చా 5 లక్షల మంది విద్యార్థుల సంతకాల పత్రాలను ప్రభుత్వానికి సమర్పించింది. బకాయిలు విడుదలయ్యే వరకు పోరాటం ఆగదని రామ్ చందర్ రావు స్పష్టం చేశారు.

డెస్క్

**కొండా సురేఖ**

పర్యావరణాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి , వాటిని సంరక్షించాలని అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. వరంగల్ రంగసాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి వన మహోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...

బైట్ ... కొండా సురేఖ, మంత్రి

పిటిసి, వరంగల్

**అడ్లూరి**

అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేలా మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ఈరోజు పెద్దపల్లి జిల్లా, ధర్మారం మండలంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు.

పీటీసీ, పెద్దపల్లి

**టిమ్స్**

డాక్టర్ ఎంసీఆర్ టిమస్‌లో నిమ్స్ తరహా టారిఫ్‌లను అమలు చేయడానికి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధ్యక్షతన టిమ్స్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌లో జరిగిన తొలి ఈసీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. డాక్టర్లు , సిబ్బంది నియామకాలకు నిమ్స్ సర్వీస్ రూల్స్ ను అనుసరించాలని, ఆర్థిక లావాదేవీలను ట్రస్ట్ అండ్ రిటెన్షన్ అకౌంట్ ద్వారా నిర్వహించాలని కూడా ఈసీ ఆమోదించింది. మల్టీ లెవల్ కార్ పార్కింగ్ , అదనపు టాయిలెట్ కాంప్లెక్స్ , పీజీ కాలేజీ కోసం హాస్టళ్ల నిర్మాణ ప్రతిపాదనలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

డెస్క్

**వాతావరణం**

రాష్ట్రంలో రాగల ఏడు రోజుల పాటు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈరోజు హైదరాబాద్ , రంగారెడ్డి, మేడ్చల్, ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం సహా దాదాపు 24 జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని ఎల్లో అలర్ట్ జారీ చేసింది. హైదరాబాద్‌లో సాయంత్రం వేళ తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

పీఎన్

**వన మహోత్సవం**

ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా వనమహోత్సవం కార్యక్రమం పలు జిల్లాల్లో నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని , మొక్కలు నాటి సంరక్షించాలని , రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ గరిమ అగర్వాల్ పేర్కొన్నారు.
మొక్కలు నాటి సంరక్షించడం ద్వారా సమతుల్య వాతావరణాన్ని నిర్మించవచ్చనీ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.
వనమహోత్సవం కింద మొక్కలు నాటడమే కాదు , నాటిన ప్రతి మొక్కను కూడా సంరక్షించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.
ఈ నెలాఖరులోగా నిర్దేశిత లక్ష్యం మేరకు జిల్లాలో 17 లక్షల మొక్కలు నాటుతామని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె హైమావతి తెలిపారు.
ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి దాని సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా స్థానిక సంస్థల కలెక్టర్ ఏపూరి భాస్కరరావు సూచించారు.
మెదక్ జిల్లా కేంద్రంలోని మహిళా మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మొక్కలు నాటారు.
ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని నిర్మల్ జిల్లా సూపరింటెండెంట్ పోలీస్ జానకి షర్మిల అన్నారు.

పిటిసి, నిర్మల్, మెదక్, సిద్దిపేట, నల్గొండ, మంచిర్యాల, సిరిసిల్ల

**హైకోర్టు**

తెలంగాణ హైకోర్టుకు ఆగస్టు 27న ప్రత్యేక సెలవు ప్రకటిస్తూ రిజిస్ట్రార్ జనరల్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈనెల 27వ తేదీ గురువారం హైకోర్టుతో పాటు సికింద్రాబాద్‌లోని తెలంగాణ స్టేట్ జ్యుడీషియల్ అకాడమీ, తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, హైకోర్టు లీగల్ సర్వీస్ కమిటీ, హైకోర్టు ఆర్బిట్రేషన్ అండ్ మీడియేషన్ సెంటర్‌లకు ప్రత్యేక సెలవు వర్తిస్తుందని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. దీనికి ప్రతిగా డిసెంబర్ 19వ తేదీ శనివారాన్ని హైకోర్టుకు వర్కింగ్ డేగా ప్రకటించారు.

డెస్క్

**కవిత**

పాలిటెక్నిక్ విద్యపై అధ్యయనానికి తెలంగాణ రక్షణ సేన కమిటీని ఏర్పాటు చేసినట్లు పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం జీవో 97 తీసుకువచ్చి పాలిటెక్నిక్ విద్యను స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి చేర్చడంతో విద్యార్థులు నిరసనలు చేపడుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. జీవో 97ను రద్దు చేయాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో దుష్పరిణామాలపై సమగ్ర అధ్యయనం చేసి వారం రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని విద్యావేత్తలు , పార్టీ నాయకులతో కూడిన ఏడుగురు సభ్యుల కమిటీని కవిత ఆదేశించారు.

డెస్క్

**సమీక్ష**

ఎల్‌నినో ప్రభావం, NEET-PG ప్రవేశ పరీక్ష ఏర్పాట్లు, పర్యాటక అభివృద్ధిపై సీఎస్ సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లతో ఈరోజు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయాలని , తక్కువ నీటి అవసరమయ్యే పంటలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈనెల 30న జరగనున్న NEET-PG పరీక్షకు రాష్ట్ర వ్యాప్తంగా 30 సెంటర్లలో మౌలిక సదుపాయాలు , భద్రత, విద్యుత్ ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలని సూచించారు.

డెస్క్

**హరీష్**

22-ఏ నిషేధిత భూముల వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలదే ప్రధాన బాధ్యత అని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్ రావు ఆరోపించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం షాపూర్ నగర్‌లో 22ఏ బాధిత కుటుంబాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కమీషన్ల కోసమే సామాన్యుల ఆస్తులను నిషేధిత జాబితాలో పెట్టారని, దీనిపై సిట్టింగ్ జడ్జితో తక్షణమే విచారణ జరిపించి శ్వేతపత్రం విడుదల

చేయాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ మంత్రి పొంగులేటిని వెంటనే బర్తరఫ్ చేయాలని అన్నారు. బాధితుల పక్షాన సెప్టెంబర్ 7న అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని హరీశ్ రావు స్పష్టం చేశారు.

డెస్క్

**కౌన్సిలింగ్**

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అగ్రి బీఎస్సీ కోర్సుల కౌన్సిలింగ్ ఈనెల 27 నుంచి ప్రారంభం అవుతుందని ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తెలిపారు. 29వ తేదీ శనివారం వరకు కౌన్సిలింగ్ కొనసాగనుంది. ఎప్‌సెట్-2026లో అర్హత సాధించి దరఖాస్తు చేసుకున్న బైపీసీ అభ్యర్థులు 13 కళాశాలల్లోని బీఎస్సీ అగ్రికల్చర్ , హార్టీకల్చర్, బీటెక్ ఫుడ్ టెక్నాలజీ సీట్ల కోసం హాజరు కావాలని జానయ్య వివరించారు.

డెస్క్

**సినిమా**

మహిళా సాధికారత ఇతివృత్తంగా నిర్మించిన ఒక సినిమాను మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క విడుదల చేశారు. మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన ఓ అమ్మాయి అనేక కష్టాలను, ఊపిరితిత్తుల కాన్సర్‌ను జయించి ఐఏఎస్ సాధించిన నేపథ్యంలో రచయిత , దర్శకుడు తిరుపతి పటేల్ సిద్దెంకి ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ సందర్భంగా మంత్రి దర్శకుడిని సన్మానించారు.

డెస్క్

**మండల్ జయంతి**

బీసీ రిజర్వేషన్ల పితామహుడు , బీహార్ మాజీ ముఖ్యమంత్రి బిందెశ్వర ప్రసాద్ మండల్ జయంతి కార్యక్రమాన్ని నల్లగొండ లో ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని కోర్టు ఎదురుగా ఉన్న మండల్ విగ్రహానికి బీసీ సంక్షేమ సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షుడు చిలకరాజ సతీష్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

పీటీసీ, నల్లగొండ

**డ్రగ్స్ రహిత సమాజానికి అందరూ కృషి చేయాలి**

రంగారెడ్డి జిల్లా , మహేశ్వరం లో కేంద్ర సమాచార , ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, హైదరాబాద్ ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగావార్తా మీడియా వర్క్ షాప్ ఈరోజు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహేశ్వరం జోన్ డీసీపీ కె. నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడు తూ... నేర రహిత సమాజం కోసం మీడియా ప్రతినిధులు తమ వంతు కృషి చేయాలని సూచించారు. పిల్లల ప్రవర్తనలో ఏమైనా తేడాలు కనిపిస్తే కుటుంబ సభ్యులు గుర్తించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రింట్ , ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సోషల్ మీడియా ద్వారా సమాచారం వేగంగా వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో ఏ వార్తనైనా , సందేశాన్నైనా నమ్మే ముందు నిర్ధారించుకోవాలని , తప్పుడు వార్తలు, మోసపూరిత సమాచారాన్ని ఫార్వర్డ్ చేయకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పీటీసీ, యాదాద్రి భువనగిరి